కథా నిలయం
5975
శ్రీకాకుళం

# ఎంత సుదీర్ఘ మీ జీవితం!

తలుపు తెరిచి డాబాపైకి వచ్చి, ఎదురుగా ఉన్న సముద్రాన్ని చూశాను. బూడిద రంగులో, విరుగుతున్న అలల్తో అందంగా ఉంది. సముద్రం, ఆకాశం కలిసే గీత దగ్గర నాలుగైదు తెరచాప పడవలు, హాయిగా అనిపించింది ప్రాణానికి. ఇంట్లో కూడా ఎవరూ లేరు. కొడకూ, కోడలు మరో గంట వరకూ రారు. ఒక్కణ్ణే, ఈ డాబా మీద...

ఈ లోపల రత్నం ఓ పడక్కుర్చీ తెచ్చి కిటికీ దగ్గర్ నీడగా ఉంటే అక్కడ వేసింది. ఆ కిటికీ నా గది కిటికీ. ఆ పక్కనే పెద్ద మామిడి చెట్టుండడంతో అక్కడ సాధారణంగా నీడగానే ఉంటుంది.

ఓసారి డాబా అంతా తిరిగి కుర్చీలో కూచుంటూ అటూ ఇటూ కింద చూశాను.

కింద నుంచి పాకుతూ డాబా గోడ ఎక్కిన బోగన్‌విల్లా తీగలు కుప్పలా అల్లుకుపోయి ఉన్నాయి. ఎండిన ఆకులూ, పువ్వులూ గచ్చుమీద గాలికి కదులుతూ దేకుతున్నాయి. ఆ 'ట్రాఫిక్' లోంచే కొన్ని నల్లచీమలు అడ్డొస్తున్న ఆకుల్ని, పువ్వుల్ని తోసుకుంటూ వెళ్తున్నాయి.

కుతూహలంగా వాటివైపే చూస్తూ కూచున్నాను. ఆ చీమలన్నీ డాబాగోడకి ఆనుకుని ఉన్న ఓ చచ్చిన సీతాకోక చిలుకదగ్గర కెళ్లాయి. అప్పటికే అక్కడ కొన్ని చీమ లున్నాయి. అన్నీ కూడబలుక్కుంటున్నాయి. 'ఈ చిలకమ్మని తమ ఇంటి కెలా చేర్చాలా?' అని కావచ్చు. అన్నీ అటూ, ఇటూ, ఇటూ అటూ సద్దుకుంటూ హడావుడి పడి ఆఖరికి కదిలాయి సవారిమోస్తూను.

బరువుగా ఉంటుందా, ఉండదా! ఆ చిన్న ప్రాణాలకి ఆ సీతాకోకచిలుక బరువుగానే ఉండవచ్చు. పాపం! అలాగే లాక్కెళ్తున్నాయి. వా ళ్లింటికి తీసుకుని వెడతాయి. రంగు రంగు రెక్కలూ, నల్లటి ఒళ్లు, పొడుగాటి రెండు మీసాలూ, 'ఆహా! ఓహో!' అని సంబరంగా లొట్ట లేసుకుంటూ తింటాయిలా ఉంది.

ఒక్కసారిగా ఒంటికి గాలి చలిగా తగిలింది.

కళ్లెత్తి చూశాను. ఆకాశంలో యిందాకటి నిర్మలత్వం లేదు.

ఏదీ ఆ నిర్మలత్వం? ఎవ రెత్తుకెళ్లారు? నల్ల మేఘాలా? ఇన్ని మేఘా లెలా వచ్చాయి? ఎక్కణ్ణించి వచ్చాయి!

ఏ ఊర్నించి వచ్చాయి? స్వర్గంలోంచే వచ్చాయా!

నా సుశీల బావుందా – అని ఒక్కసారి అడిగితే!

సుశీల నిజంగా స్వర్గంలోనే ఉందా! అక్కడే ఉంటుంది. సుశీల చాలా మంచిది. మంచి వాళ్లంతా స్వర్గానికే వెళ్తారు. నే నెక్కడికి వెళ్తాను? ఈ ఆకాశంలో ఓ నక్షత్రంగా అయిపోతే! రోమియో చచ్చిపోతే, అతని శరీరం అంతా చిన్న ముక్కలయ్యి నక్షత్రాలుగా మారి, రోజూ రాత్రి ఈ భూమిని చూస్తుండాలని జూలియట్ అనుకుంది కదా! నేనూ అంతే! అలాగే నక్షత్రంలా మారివుండాలి.

"లోపలి కొచ్చేయండి, బాబూ! చలిగాలి కొడ్తోంది!"అంటూ రత్నం డాబా పై కొచ్చింది.

"నువ్వు నీ పని చూసుకో! అస్తమానం నా వెనకాలే తిరక్కు ఫో" అన్నాను చిరాగ్గా.

"అయ్యగారు కోప్పడతారు, మిమ్మ ల్నిలా ఒదిలేస్తే."

"నే చెప్తాలే. నువ్వు ముం దిక్కణ్ణించి వెళ్ళు."

"చల్లగాల్లో కూచోమాకండి బాబూ...!"

పొమ్మన్నట్టు ఒక్కసారి చెయ్యూపాను. మాట మధ్యలోనే ఆపి వెళ్లిపోయింది. ఆకాశంలోకి చూశాను – నల్లగా ఉంది.

కొబ్బరిచెట్లు అటూ, ఇటూ పిచ్చిగా ఊగిపోతున్నాయి. వాటిని చూసి జాలిపడ్డాను. ఎంత సేపు అలా ఊగుతుంది? నొప్పి వేస్తుందా! తప్పకుండా నొప్పి వేస్తుంది. పాపం! కుర్చీలోంచి లేచి కర్ర పట్టుకుని నడుచుకుంటూ పిట్టగోడ దగ్గర నుంచున్నాను.

కింగ్ ఫిషర్ రివ్వు రివ్వు మంటూ ఎగుర్తోంది. దాని దృష్టి చాలా పదునైన ఆ నీళ్లల్లో కదిలే చేపని గురి తప్పకుండా ముక్కు నెగరేసుకుపోతుంది. ఇంకా చేపలు దొరకలేదేమో! నిటారుగా ముక్కుని నీళ్లలోకి ముంచింది. దొరకలేదు. పైకి లేచింది. ఈసారి మరో ప్రయత్నం... ఎంత వేగంగా నీళ్లలో ముక్కుని ముంచిందో అంత వేగంగా పైకి లేచింది. దాని పొడువైన ముక్కున గిలగిల లాడుతున్న చేప తోక.

అయ్యో! అనవసరంగా నీళ్ల పైకి తేలిందే! ఈ పక్షి కంట బడింది. దాని బ్రతుకయిపోయింది.' దాని జీవితం అంత చిన్నదా!

దేవు దేమాత్రం జాలిపడకుండా దాని జీవితాన్ని అలా ఎందుకు చేశాడు? నా జీవితాన్ని ఇంత పెద్దగా, అంతులేకుండా చేశాడేం?

'ప్రేమ, జ్ఞానం నన్ను పైకి తీసుకెళ్తుంటే, ఈ జాలి నన్ను భూమ్మీదకి లాగేస్తోంది.

ఎవ రున్నారు? రూసోనా? ఎవరూ? ఇంత మరుపు! రస్సెల్ పుస్తకాలు పంపించమని, ఈసారి చిదానందం లైబ్రరీకి ఫోన్‌చేసి చెప్పాలి. చాలా రోజులయింది ఆయన్ని చదివి.

పడవల వాళ్లు హుషారుగా పాటలు పాడుకుంటూ వచ్చేస్తున్నారు.

చేపలు బాగా పడే ఉంటాయా!

పాపం! ఈ చేపల జీవితాల్లో చివరి ఘట్టం ఎంత తొందరగా వచ్చేస్తుందో! దాని ప్రమేయం లేదు. ఆశ్చర్యం!

గాలి ఎక్కువైంది.

తుఫా నొస్తుందా!

అందంగా ఉన్న ప్రపంచం మరుక్షణంలో నలిగిపోతుందా!

"బాబుగారూ! వొరషం వచ్చేట్టుగా ఉంది. లోపలికి వచ్చీకూడదూ!" రత్నం అక్కడ.

వెనక్కి తిరిగి మింగేసేలా చూశాను. నా ఆనందం నాశం చెయ్యడానికే దీన్ని నాకు పెట్టారు. అన్నింటికి ఆంక్షలూ. నా మీద నిఘా.

"బాత్రూం కెల్తా రేటీ?"

దీని క్కూడా నే నంటే ఎంత అలుసు? ఏదో కిడ్నీలో కొంచెం ఇబ్బంది అయితే? అసలు వీళ్లందరికీ ఓ వెర్రి చుట్టుకుంది నా కంట్రోలింగ్ శక్తి పోయిందని.

గంట గంటకీ పాట 'బాత్రూం కెల్తారా, బాత్రూం కెళ్తారా?' ఏవైనాఅంటే, మీకు తెలీదు. బాత్రూం కెళ్లేలోగానే బట్టలన్నీ తడిపేస్తున్నారు, వాళ్లు ఉతకడానికి విసుక్కుంటున్నారు"అని గోల.

వాళ్లు ఛావడంకాదు కానీ, నన్ను ఛంపుతున్నారు. ఆ సంగతి వాళ్లకి తెలియడం లేదు.

చేతి కర్ర ఎత్తాను కోపంగా.

వెళ్లిపోయింది. నాకు తెలుసు అది నా గది తలుపుకి, డాబా పైకి రావడానికి కున్న తలుపుకి మధ్య కూచుని ఉంటుంది. దాని స్థలం అదే. నేను డాబా మీద ఉన్నా, నా గదిలో ఉన్నా అక్కడే ఉంటుంది. కాస్త అలికిడి అయితే చాలు పరుగెత్తు కొచ్చేస్తుంది. ఈ పరిగెత్తడానికే దానికి జీతం, తిండి కొడు కిస్తున్నాడు.

కాళ్లు నొప్పి చేస్తున్నాయి.

చలిగాలి రివ్వున చెవుల్లోంచి దూరిపోతోంది. చెంపల పైకి వస్తోంది. మనసు హాయిగా అయిపోయింది ఒక్కసారిగా.

"చల్లగాలిలో...యమునా తటిపై..." అప్రయత్నంగా పాట. నేనేనా?! నా నోట్లోంచి పాట వచ్చి ఎన్నేళ్లయింది!

రిటైర్ అయిన కొద్ది రోజులకే సుశీల పోవడంతో అన్నీ పోయినట్లనిపించింది. అందులో పాటలు కూడా. కానీ...ఇవాళ...పన్నెండేళ్ల తర్వాత మళ్లా నా నోట్లోంచి పాట మానసికంగా ఒంటరిగాణ్ణయిపోయాకా జీవితం అర్థం లేనిదిగా అనిపించింది. లక్ష్యం లేకుండా తిరుగుతున్న ఈ భూమ్మీద సంతోషం, ఓ పిసరంత జ్ఞానం, మానవత్వం పెరగడానికి తోడ్పడే శక్తి లేకుండా బతుకుతున్నట్లుగా ఉంది.

ఇన్నాళ్లకి అప్రయత్నంగా వచ్చిన పాటతో మనసులో ఎక్కడో పొరల్లో దాగిపోయిన పాటల మీద ఇష్టం ఒక్కసారిగా పైకి పొంగింది.

చేతి కర్ర సాయంతో నడుచుకుంటూ నా గదిలోకి వెళ్లాను. పైన డాబామీద నా గది పక్కనే మరో చిన్న వరండా. అక్కడే రత్నం కూచుని ఉంది. ఆ పక్కనే కింద హాల్లోకి వెళ్లడానికి మెట్లు. ఆ మెట్లు దిగలేను. ఆ అవసరం కూడా లేదు. అన్నింటికి రత్నం ఉంది. పొద్దున్నా, రాత్రి కొడుకూ, కోడలూ ఆఫీసు కెళ్లేముందూ, సాయంత్రం ఓసారి మాట్లాడి వెళ్తారు. ఏవేం తినకూడదో, ఎంత తినాలో చెప్పి చెప్పి వెళ్తారు.

మధ్యాహ్నం ఓసారి ఫోనే చేస్తారు. ఇంకెప్పుడైనా వీలవుతే కూడా ఫోన్ చేస్తారు. అంతే! ఇంకేం ఉంటాయి మాటలు? మనవ లిద్దరూ కొడైలో చదువుతున్నారు. వాళ్లొచ్చినప్పుడు కొంచెం మార్పు. అంతే. 'జీవితం ఇలా కాదు. ఇది కాదు'అని నాకు ప్రతీక్షణం అనిపిస్తుంది. కానీ ఏం చెయ్యను? మైల్డ్ స్ట్రోక్ మూలంగా నా జీవితాన్ని నేను అనుకున్న విధంగా మార్చుకోలేకపోతున్నాను. రెండేళ్ల క్రితం పెరాలిసిస్ వచ్చి కుడి వైపు పనికిరాకుండా పోయింది. అయితే మూడు నెలల్లో మామూలు మనిషి నయ్యానే కానీ, కాలు, చెయ్యి ఇదివరకులాగా లేవు. ఇద్దరు కొడుకులు అమెరికాలో ఉన్నారు. వాళ్లు రమ్మంటారు కానీ, ఆ ఒంటరితనం మరీ పిచ్చి పట్టిస్తుంది. ఇక్క ఈ పనిమనుషులు తెలుగే మాట్లాడుతారు. టీ.వీ. పెడితే తెలుగే వినపడుతుంది. నా పాత స్నేహితులు ఎవరైనా బుద్ధి పుట్టినప్పుడు వస్తూంటారు. కజిన్స్ ఎవరైనా విశాఖపట్నం వస్తే వచ్చి చూసెళ్తుంటారు. ఆ ఒయాసిస్సులు చాలు.

గదిలోకి వెళ్లాను.

ఆ గదిలో లేని సరుకు లేదు. అన్నీ ఇంపోర్టెడ్ పుస్తకాలు, కాసెట్స్, వీ.సి.ఆర్.టీ.వీ...సమస్తం.

రికార్డ్ ప్లేయర్‌లో రాజేశ్వర్రావ్ పాటలు పెట్టాను. చెవులు తమ పని సరిగ్గా చెయ్యడం లేదు. 'హియరింగ్ ఎయిడ్' అమర్చుకుని కర్ర పట్టుకుని మళ్లా డాబా పైకొచ్చాను. కుర్చీలో కూచున్నాను. కళ్లు మూసుకుని పాటలు వింటున్నాను.

చలిగాలి కొట్తోంది.

"బాబుగారూ! శాలువా తెచ్చాను, కప్పుతాను" నా ప్రమేయం లేకుండానే నా మెడమీద సర్దింది.

ఒక్కసారి వెచ్చగా అనిపించింది.

ఆ చలిగాలే బావుంది, ఈ శాలువా కంపలా అనిపించింది.

"లోపలి కొచ్చేయండి. వొరషం వచ్చేట్టుగా ఉంది" వినయంగా అంది. దాని నక్క వినయాలు చూస్తే నాకు మంట.

"ఇగో! ఇంకా వర్షం రాకుండానే గొడవ పెట్టేస్తావేం? వర్షం వస్తే నేను వస్తాలే! ను వ్వెళ్లు" అన్నాను విసుగ్గా.

"మీకు ఈ చల్లగాలి పడదని అమ్మగా రన్నారు."

"ఏం పర్వాలేదు. నువ్వెళ్లు. వర్షం మొదలైనప్పుడు నేనే వస్తాను" వెళ్లిపోయింది.

గుచ్చుకుంటున్నట్టుగా ఉన్న శాలువాని విసిరేశాను.

అది వెళ్లి బోగన్‌విల్లా పొద దగ్గర నేలమీద పడింది. ఇందాక అక్కడ చీమలూ, సీతాకోక చిలుకా ఉండాలే!

అయ్యో! ఉన్నాయో, లేదో! ఇంత పెద్ద శాలువా అంత చిన్న ప్రాణుల మీద! ఊహించుకోలేకపోయాను.

గబగబా వెళ్దా మనుకున్నాను. కానీ...వెళ్లలేకపోయాను.

కా ళ్లీడ్చుకుంటూ కర్ర సాయంతో మెల్లగా వెళ్లాను.

శాలువా తీసి అతి జాగ్రత్తగా చూశాను. చీమలూ లేవు, సీతాకోకచిలుకా లేదు. ఊపిరి పిల్చుకున్నాను.

పర్వాలేదు. చీమలు జాగ్రత్తపడ్డాయి. వర్షం రాకుండా వెళ్లిపోయాయి సీతాకోక చిలుకని ఆనందంగా ఆరగిస్తుంటారులా ఉంది.

శాలువాని అక్కడే పడేశాను.

అలసటగా కుర్చీలో వాలాను.

నల్లగా సముద్రం, దానిపైన నల్లటి ఆకాశం. మధ్య సన్నగీత. ప్రపంచం అంతం అయ్యేదగ్గరా ఒంటరితనమేనా! అందుకే ఆ గీత అటు సముద్రాన్ని ఇటు ఆకాశాన్ని తనలో కలుపలేకపోతోందా! వాటిని అందుకోలేకపోతోందా!

"కీచు...కీచు..." శబ్దం...పక్కగా వినబడింది.

దృష్టి మరల్చి ఆ శబ్దం వైపు చూశాను.

ఓ చిన్నపిట్ట బోగన్‌విల్లా ఆకుల కింద ఉంది.

బిక్కమొహం వేసుకుని అటూ ఇటూ చూస్తోంది.

జాలి వేసింది. ఎక్కణ్ణించి వచ్చిందీ! ఎక్కడికి వెళ్తుంది? దగ్గరా! దూరంవా! గాలివిసురుగా మొహాన్ని కొట్టింది. శాలువా ముందుకి జరిగింది. ఆ శాలువా కిందున్న సన్నటి ఎండు కొమ్మలూ, ఆకులూ కూడా సన్నటి శబ్దం చేస్తూ జరిగాయి.

నా చెవులకి ఇంపుగా అనిపించింది.

నవ్వు...నా పెదవులు విచ్చుకోలేదు...శబ్దం కూడా రాలేదు. కానీ...ఓ రకమైన ఆనందంతో పెదవులు విడని నవ్వు...చాలా రోజు లయింది.

"థాంక్యూ"అన్నాను.

ఆ పిట్టకి అర్థం కాలేదు.

"నాకు తోడుగా..."

'కిచ కిచ'మంది. ఎంతసేపు వుంటుందీ? వర్షం వచ్చేట్లుగా ఉందే? ఏం చెయ్యను? ఏం చెయ్యగలను?

ఓ చినుకు చేతిమీద పడింది.

పట్టకేసి చూశాను. చాలా చిన్నది. గూటిలోనుంచి ఎగిరి వచ్చేసింది. ఇప్పుడు దారి తెలీటం లేదు.

కుర్చీలోంచి లేచి దాని గూడు దగ్గర్లో ఏంవైనా ఉందేమోనని చూశాను. మామిడి చెట్టుమీద గూళ్లుంటాయా? ఉండవేమో!

మరో రెండు చినుకులు పడ్డాయి.

దానివైపే చూశాను. అమాయకంగా చూస్తోంది అటూ ఇటూ చిన్న అడుగులు వేస్తూ.

ఎంత ముద్దుగా ఉందో!

సన్నటి పొడుగాటి ముక్కు...సూదిలా...ముందుకు పొడుచుకొచ్చింది. దీని ము క్కెంత బావుందో! పిట్ట ముక్కు ఇంత బావుంటుందా!

'కిచ్ కిచ్' మంది.

పాపం! ఆకలేస్తోందేమో!

"రత్నం!" కేకేశాను.

"రండి బాబుగారూ! రండి" అంటూ వెంటనే వచ్చింది.

"నిన్ను పిలిచింది నన్ను లోపలి తీసుకెళ్లమని కాదు. కొన్ని బియ్యం గింజలు తీసుకురా! ఇక్క డో పిట్టుంది. దాని కాకలి వేస్తున్నట్లుగా ఉంది."

వింతగా నావైపు చూసింది. కదల్లేదు.

"ఏం టా వెర్రిచూపు! పట్రా ఫో!" అరిచాను.

"ఎక్క డుంది పిట్ట అని చూస్తున్నాను" నసిగింది.

"ను వ్వో గుడ్డి మొహానివి. ఆకుల దగ్గర, చెట్టు దగ్గర, గోడ దగ్గరగా కనపడిందా! ఫో! గింజలు పట్రా!"

"కిచ కిచ"మంది.

"ఆకలేస్తోందా! ఉండు గింజలు తేవడానికి రత్నం వెళ్లింది. తెచ్చాక వేస్తాను" దాని కర్థం అయిందో, లేదో!

ఒకటీ అరా చినుకు ఉండీ ఉండీ పడుతోంది.

ఈ రత్నం పీనుగ రాదేం? కింద వంటావిడతోనే, పనిమనిషితోనో మాట్లాడుతూంటుంది. వెధవ కబుర్లు. కబుర్లేనా ప్రపంచం! దానికి, నాకు కబుర్లు తప్పించి ఏం తెలుసు?

చీకటి కూడా పడేట్లుగా ఉంది.

పాపం! ఈ పిట్ట సంగతి ఏంవిటీ? వా ళ్లింటికెలా వెళ్తుంది? పెద్దగాలీ, వానా వస్తే దీని బ్రతుకు కేం కానూ?

నిరాశగా ఇటూ అటూ దిక్కులు చూస్తోంది.

రత్నం వచ్చి ఓ చిన్న గిన్నెలో సగం బియ్యం గింజలు తెచ్చింది. అక్కడే నుంచుంది.

"ను వ్వెళ్లు"

వెళ్లిపోయింది.

"ఆకలేస్తోందా! ఇంద ఇవి తిని మీ ఇంటికి వెదుదువుగానిలే"అర్థం అయిందో లేదో వెనక్కి ఆకుల్లోకి జరిగింది.

ఉరుములు మెరుపులు...

ఒక్కసారిగా నిశ్శబ్దంగా అయిపోయింది.

అందులోంచే సముద్రం హూరూ...రయ్యిమంటున్న గాలి. గింజదగ్గరికి రాలేదు. ఇంకా వెనక్కి వెళ్లింది. ఇంకా కొంచెం వెనక్కి వెళ్తే పిట్టగోడ వస్తుంది. అక్కడ దానికి బావుంటుంది.

ఓ పది అడుగులు. దాని ప్రాణానికి, అది ఉన్న ఈ స్థితిలో ఆ పది అడుగులు ఓ పది మైళ్లు.

"కొంచెం ఆగు. ఎలాగో నిన్ను ఆ ఆకులకిందకి చేరుస్తాలే."

జాలిగా చూస్తోంది, అరుస్తోంది.

"కొంచెం ఓపిక పట్టు."

ఏదైనా అట్టముక్కలు తెచ్చి దాన్ని, దానిమీద కెక్కించి చేర్చేస్తాను.

"రత్నం! నాలుగు కాసెట్లు పట్టుకురా!"

క్షణంలో కాసెట్లు, టేప్ రికార్డర్ నేను పాటలు వినను, లోపల పెట్టెయ్!"

అలాగే చేసి వెళ్లింది.

కాసెట్‌లోంచి కవర్ మటుకు తీసుకుని పిట్ట దగ్గరి కెళ్లాను. గబుక్కున నా చేతిలోంచి కవర్ పడి ముక్కలయింది.

మళ్లా వచ్చి మరో కాసెట్ నుంచి కవర్ తీసుకున్నాను. ఆలోచించి ఎందుకైనా మంచిదని మూడు కవర్లు తీసుకున్నాను. మళ్లా దాని దగ్గర కెళ్లాను.

ఆయాసం, అలసట.

ఒక్క నిమిషం అలాగే నుంచున్నాను.

రెండు చినుకులు పడ్డాయి.

నాలుగు కవర్లని అటూ ఇటూ ఆకుల కింద అమర్చడానికి ప్రయత్నం చేస్తుంటే, ఒక్కసారి అవి కింద పడి రెండేసి భాగాలుగా అయ్యాయి. ఈలోపల పిట్ట తప్పటడుగులు వేస్తూనే బాగా వెనక్కి గోడవరకూ జరిగింది. అమ్మయ్య' అనుకున్నాను.

ఇంక ఈ కాసెట్ కవర్లు అక్కర్లేదు. ఆలోచించి ఓ రెండు కవర్‌లు ఆకుల కింద ఉంచాను. చనుకులు పెద్ద వవుతున్నాయి. ఆలోచన వచ్చింది. వెచ్చగా ఉండడానికి ఆ చిన్న కాళ్లకింద దూది పెడ్తే...

చేతి కర్రని తీసుకుని నా గదివైపు నడవటం మొదలు పెట్టాను.

కర్ర శబ్దం వింటూనే వచ్చేసింది రత్నం.

దాన్ని కిందకి పంపిస్తే నా పన్లకి అడ్డు రాదు.

"ఇగో రత్నం! కాఫీ పట్రా. ఆ బిళ్లలు వెయ్యద్దు అని చెప్పు. అలాగే తాగేస్తాను. దాంతోపాటూ బిస్కెట్లు కూడా."

వెళ్లిపోయింది.

పీడ వదిలింది. ఓ పదినిముషాలవరకూ రాదు. గదిలో మందుల కాబినెట్‌లో దూది ఉంది. అందులోంచి అతి కష్టమీద నాలుర గైదు సార్లు లాగి రెండు చేతులు పట్టేంత దూది తీసుకున్నాను.

పిట్ట వరకూ వెళ్లాను.

దూదిని విడివిడిగా చేసి దాని కాళ్ల దగ్గర పెట్టాలి అన్న నా ప్రయత్నం ఫలించేట్లుగా లేదు.

గాలికి నా చేతుల్లోంచి దూది ఎగిరిపోతోంది.

ఓపిగ్గానే ఒంగి దూదిని దాని కాళ్లవరకూ తోస్తున్నాను. నా చేతుల్లో అంతపట్టేదీ? గాలిలోకి ఎగిరిపోతోంది. ఎలాగో కొంచెం దూదిని వెనక్కి గోడవరకూ చేర్చాను.

గబగబా వాన కురవటం మొదలెట్టింది.

ఆకుల్లోంచి చినుకులు దాని మీద పడితే...

ఏం చెయ్యను? ఒంగి పిట్టని చూశాను. ఆ దూది మీదకి ఎక్కింది.

కుర్చీని ఎడం చేత్తోని అక్కడి వరకూ లాగి కూచుని పిట్టని చూశాను.

ఆ తెల్లటి దూది మీద ఆ చిన్నచిన్న కాళ్లు...ఎంత ము ద్దొచ్చింది.

కానీ...ఆ కళ్లలో ఎంత నిరాశ...

"అలా...నిరాశగా చూడగు...అలా ఉండకు."

"... ......"

'నువ్వు మీ ఇంటి కెళ్తావు. మీ అమ్మ దగ్గర కెళ్తావు. అదే ఆశ పెంచుకో! నేనూ అదే ఆశని ఎప్పుడూ పెంచుకుంటాను. అలా అని ఆశావాదిని కాను. అంతా బాగాలేదని అనుకునే నిరాశావాదిని కాను. కానీ...ఎప్పటికైనా ఈ ఒంటరితనం పోతుందన్న ఓ చిన్న ఆశని నాలో పెంచుకుంటున్నాను. ఆపాటి ఆశని నాలో పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞత ఎప్పుడూ చెప్పుకుంటాను. నువ్వు నీ గూటికి వెళ్తావు."

దానికి అర్థం అయినట్లు లేదు.

దాని చూపులు అలాగే ఉన్నాయి.

వర్షం పెద్ద దయింది.

వర్షం వాలు కూడా మారింది. ఆకుల్లోంచి చినుకులు పడేట్లుగా ఉంది.

'ఐడియా!' శాలువా తీసి ఆకుల మీద వేశాను. కుర్చీని అడ్డుగా పెట్టాను, దానిపైకి నీళ్ల పడకుండా. కాళ్లకింద దూది, దూది కింద కాసెట్‌కవరు. హమ్మయ్య!

గాలి విపరీతంగా వేస్తోంది.

కర్ర పట్టుకుని ఒక్కొక్క అడుగే మెల్లగా, పాదాల్ని తడి బండమీద వేళ్లతో నొట్టిపెట్టి నొక్కిపెట్టి నడవడం మొదలు పెట్టాను.

నేను తడిసిపోయాను.

ఇలా వర్షంలో తడిసి ఎన్ని ఏళ్లయిందో? ఎంత హాయిగా ఉందో జుట్టులేని తలమీద నుంచి నీళ్లు మొహంమీదకి కారిపోతోంది. కళ్లద్దాలకి వైపర్ లేదు. మసక బారిపోతున్నాయి.

ముక్కు మూలిగింది.

గొంతు చిరచిర లాడింది. నే నదేం పట్టించుకోలేదు.

పంచ, చొక్కా తడిసిపోయాయి. లెక్కచెయ్యలేదు.

అతి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాను. పడిపోతే...

భయమే మరి. జారితే...కాలు విరిగితే...మళ్లీ మంచం పడ్తే... ఆ నరకం... ఈ ఒంటరితనాన్ని మించింది!

నడుం పట్టినట్లుగా అనిపిస్తోంది.

చాలాసేపు ఒంగడం వల్ల మోకాళ్ల దగ్గర చివచివ లాడుతోంది. తూలుతున్నట్లుగా ఉంది నా నడక అని నాకే అనిపించిది.

"అయ్యో! అయ్యో!" కప్పుని కిటికీలో పెట్టి నా దగ్గరకి పరుగున వచ్చింది రత్నం.

"పూర్తిగా తడిసిపోయారు, బాబూ! ఎన్నిసార్లు రమ్మన్నా తంవరు లోపలికి రాలేదు." నా చేయి పట్టుకుని గబగబా నడిపిస్తోంది.

కొడుకూ, కోడలూ వచ్చారులా ఉంది. వాళ్లు డాబాపైకి వచ్చారు.

"ఇ దేంవిటీ! ఇలా... ఈ దూది అంతా డాబామీద కెందు కొచ్చింది?" అంటూ కోడలు.

"ఈ దూదేమిటీ? ఈ డాబా అంతా" వెనకాలే వచ్చిన కొడుకు.

"అ దేంవిటీ, ఆ శాలువా ఆ చెట్టుమీ దుందేంవిటి రత్నం! ఆ బియ్యం ఏం విటీ? ఆ కప్పు, ఆ గిన్నె అలా కింద పడేశావేం?"

"నేను కాదం డమ్మగారూ?"

"అయ్యో! కాసెట్స్ లేవు, ఉత్త కవర్లు విరిగి ఉన్నాయి."

ఘోరాపరాధం చేసినట్లు ఇద్దరూ అనుకుంటున్నారా!

"ఈయన చాదస్తం రోజు రోజుకి ఎక్కువైపోతోంది. ఆ సైకియాట్రిస్ట్ సుందరంగారి దగ్గరికి ఓసారి తీసుకెళ్లి చూపించకూడదా! ఒక్క క్షణం కూడా ఆయన్ని వదలద్దని చెప్పాం కదే! ఏం చేస్తున్నావు రత్నం నువ్వు!"

"కాఫీ తెమ్మన్నారండి. కింద కెళ్లాను."

"మంచి పని చేశావ్. ముందు ఆ నర్సయ్యని పిలు, బాబుగారి బట్టలు మారుస్తాడు."

"ఏఁవిటి నాన్నగారూ! మరీ చిన్నపిల్లాడిలా అన్నిసార్లు చెప్పించుకుంటారు. ఓసారి వర్షంలో తడిస్తే పెద్ద జ్వరం వచ్చింది. మీకు గుర్తులేదా! మర్చిపోయారా! మళ్లా ఇవ్వాళ తడిశారు. ఈ వయసులో ఇంకా చెప్పించుకుంటే బావుండదు మరి. మీకే తోచాలి. తెలియాలి."

వీ ళ్లెవరికీ అర్థంకాదు, ఇవ్వాళ సాయంత్రం నేను పొందిన ఆనందం. నా శక్తికి మించిన కష్టం పడ్డాను. రంగు తగ్గిన జీవితాన కొత్త రంగు పులిమినట్లుగా అయింది. ఆ పిట్టతోపాటు నేను గడిపిన ఆ పావుగంట నా ఒంటరితనాన్ని మరిపించేసింది. నన్ను, నా అశక్తతని కూడా మరిపించాయి ఈ క్షణాలు. నాకు ఎప్పటికీ గుర్తుంటాయి. ఈ పొడుగాటి ఒంటరి, ముసలితనం జీవితంలో ఓ చిన్నటానిక్, ఎంతో సుదీర్ఘమైనదీ ఈ జీవితం! ఇంకా పొడుగైందీ ఒంటరితనం, ముసలితనం!!

*✧ జూన్ 30 / జులై 6, 1993 ఆంధ్రప్రభ వారపత్రిక ✧*

*(శ్రీముఖ ఉగాదికథలపోటీలో ప్రత్యేక బహుమతి పొందినది)*